నేటి నుంచి ఉచిత వినికిడి వైద్య శిబిరం

వనస్థలిపురం, జూన్ 26 : ఉచిత వినికిడి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ ఆడియాలజిస్ట్ డాక్టర్ గంజి శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో కోరారు. హీయర్ వెల్ సంస్థ ఆధ్వర్యంలో పనామారోడ్‌లోని సంస్థ కార్యాలయంలో ఈ నెల 27 నుంచి 29 వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 7గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వైద్య సలహాలు, మందులు అందజేయడం జరుగుతుందన్నారు. అవసరమైనవారికి సబ్సిడీపై వినికిడి పరికరాలను అందజేస్తామన్నారు. వినికిడి లోపాన్ని ఎవరూ అశ్రద్ధ చేయవద్దని సూచించారు. వివరాలకు ఫోన్: 9703235513, 9985631926లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

విద్యాశాఖకు మంత్రి లేక పోవడం సిగ్గుచేటు

కందుకూరు, జూన్ 26 : రాష్ట్ర విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటని ఏబీవీపీ కందుకూరు నగర కార్యదర్శి ఢిల్లీ బాను ప్రసాద్ తెలిపారు. విద్యారంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరికి నిరసనగా రాష్ట్ర శాఖ ఇచ్చిన విద్యాసంస్థల బంద్‌కు నిరసనగా బుధవారం మండలంలో విజయవంతం అయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యానికి మంత్రి ఉన్నాడు, కానీ విద్యకు నియమించకపోవడం దారుణమన్నారు. విద్యారంగ సమస్యలపై ప్రభుత్వానికి పలుమార్లు విన్న వించినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైనట్లు తెలిపారు. విద్యా సమస్యలను పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ తిక్కల మణికుమార్, అమరేందర్, ప్రకాశ్ పాల్గొన్నారు.

సున్నం చెరువు కట్టకు పగుళ్లు ..

- వర్షాకాలం ప్రారంభమైనా.. మరమ్మతులు చేపట్టని అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతులు

కందుకూరు, జూన్ 26 : వర్షాకాలం ప్రారంభమైనా పలు గ్రామాల్లో చెరువులకు, కుంటలకు మరమ్మతులు చేపట్టడంలేదు. పగుళ్లు ఏర్పడినా, పిచ్చి మొక్కలు మొలిచినా పట్టించుకోవడంలేదు. వర్షాకాలానికి ముందే చెరువులు, కుంటలను పటిష్టం చేయాల్సి ఉంటుంది. ఆ దిశగా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. కందుకూరు మండల పరిధిలోని కొత్తగూడ సున్నం చెరువు కట్టకు పగుళ్లు ఏర్పడ్డాయి. మరోవైపు కట్టపై పిచ్చి మొక్కలు మొలసి అడవిని తలపిస్తోంది. దీంతో కట్టపై నుంచి వెళ్లడానికి రైతులు, ముదిరాజ్‌లు భయపడుతున్నారు. చెరువు నిండితే రైతులకు బోర్లలో భూగర్భ జాలాలు పెరగడంతో పాటు ముదిరాజ్‌లకు చేపలు పోసుకోవడానికి అవకాశం ఉన్నది. చెరువుకట్ట పటిష్టంగా లేకపోవడంతో భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కట్టలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సున్నం చెరువుకట్టపై ఏర్పడ్డ పగుళ్లు

కట్టపై పెరిగిన పిచ్చి మొక్కలు

మరమ్మతులు చేపట్టాలి..

చెరువుకట్టకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. పగుళ్లు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదు. చెరువులు, కట్టలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. చెరువులో నీరు ఉంటే రైతులకు, ముదిరాజ్‌లకు ప్రయోజనంగా ఉంటుంది.

– మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ కొత్తగూడ

చెరువే ఆధారం ..

మాకు చెరువే ఆధారం, చెరువులో నీరు ఉంటే చేపలు వదిలి పెట్టి జీవనం కొనసాగిస్తాం. చెరువులో నీరులేకపోతే బజారున పడుతాం. చెరువు కట్ట తెగితే అందులో నీళ్లు ఉండవు. కట్టకు పగుళ్లు వచ్చి తెగే అవకాశం ఉంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. తక్షణమే చెరువు కట్టను బలోపేతం చేసి ఆదుకోవాలి.

– తాల్ల బాలేశ్ ముదిరాజ్, మత్స్యకారుల సంఘం నేత కొత్తగూడ

వైభవంగా దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

ఎల్బీనగర్, జూన్ 25 : దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నవర క్షేత్రంలో శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం శ్రీ లక్ష్మీనారాయణ హోమం, లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డిని ఆలయన చైర్మన్ పూర నర్సింహా గుప్తా , చిదర నాగేందర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సూరిశెట్టి వీరేశం, బచ్చు సత్యనారాయణ, పాల్తీ శ్రీనివాస్, పొద్దుటూరి కుమారస్వామి , వక్కలంక శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయం సప్తమ వార్షికోత్సవం..

మన్సూరాబాద్, జూన్ 26: నాగోల్ డివిజన్ , జైపురికాలనీలోని శ్రీ శివ పంచయతన కాశీ విశ్వేశ్వరాలయం సప్తమ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా కార్యక్రమానికి హాజరై పూజలు నిర్వహించారు. శ్రీ కాశీ విశ్వేశ్వరాలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అదేవిధంగా వార్షికోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, అనంతుల రాజిరెడ్డి, ఉప్పల సాయితేజ, ఉప్పల సాయికిరణ్, జైపురికాలనీ అధ్యక్షుడు శ్యామల యాదగిరి, రమేశ్, మాధవి, మమత, ప్రసన్న, మీన పాల్గొన్నారు.

వేడుకలకు హాజరైన ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, భక్తులు

ఎమర్జెన్సీ .. దేశ చరిత్రలో చీకటి అధ్యాయం

సదస్సులో మాజీ డిప్యూటీ మేయర్‌ను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్ జీ, జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ,తదితరులు.

సైదాబాద్, జూన్ 26 : భారతదేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్ జీ అన్నారు. సైదాబాద్ బ్యాంక్ కాలనీలో బుధవారం బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన 'ప్రజాస్వామ్యంలో చీకటి రోజు' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనాటి ప్రధాని ఇందిరా గాంధీ రాజకీయ ప్రత్యర్థులను జైలు పాలు చేసి, వాస్తవాలు చెప్పిన పత్రికలపై తీవ్ర నిర్బంధాన్ని అమలు చేశారని విమర్శించారు. ప్రశ్నించే మేధావులు, పాత్రికేయుల గొంతునొక్కారని, ఎన్నో సంస్థలను రద్దు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్ జంగం శ్వేత, కిసాన్ మోర్చా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వినోద్, బీజేవైఎం నాయకులు దినేశ్ గౌలికర్, అశీశ్, రమన్ సింగ్, గోపి పాల్గొన్నారు.

ప్రేమించాలని వేధింపులు.. రెండేండ్ల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూన్ 26 (నమస్తే తెలంగాణ): తనను ప్రేమించాలని బాలిక వెంటపడి వేధిస్తూ, అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడు తన్నీరు సాయికుమార్(19)కు రెండేండ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ బాధిత బాలికకు రూ.లక్ష పరిహారం అందించాలని న్యాయసేవా సంస్థను ఆదేశిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. అదనపు పీపీ సునీత కథనం ప్రకారం.. నాగోల్ పరిధిలోని నువ్వులబండకు చెందిన బాలికను అదే ప్రాంతానికి చెందిన తన్నీరు సాయికుమార్ తనను ప్రేమించాలంటూ నిత్యం వేధించాడు. ఉదయం పాఠశాలకు వెళ్లే సమయంలో, తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో బాలిక వెంటబడుతూ ప్రేమించాలని హింసించాడు. 2016, జులై 18న తన పుట్టిన రోజు వేడుకలకు రావాలని నిందితుడు కోరగా.. బాలిక నిరాకరించడంతో అసభ్యంగా ప్రవర్తించాడు. జరిగిన విషయాన్ని బాలిక తన కుటుంబసభ్యులకు తెలిపింది. ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు సాయికుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తదుపరి దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పద్మావతి నిందితుడికి శిక్షవిధిస్తూ తీర్పునిచ్చింది.

అధిక ఫీజుల వసూలుకు నిరసనగా పాఠశాలల బంద్

రామంతాపూర్,జూన్ 26: కార్పొరేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల వసూలును నిరసిస్తూ రామంతాపూర్ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలను బంద్ నిర్వహించారు. ఉప్పల్ జిల్లా కన్వీనర్ బుర్ర అఖిల్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేయడం వల్ల పేద విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టం తేవాలన్నారు. ప్రభుత పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శశిధర్‌రెడ్డి

న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి

ఆర్కేపురం, జూన్ 26 : జిల్లా న్యాయ సేవా సంస్థలో ఇంటర్నేషనల్ డ్రగ్ ఎబ్యూజ్ ఎండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ డే సందర్భంగా బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శశిధర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. 1987 నుంచి ప్రతి సంవత్సరం జూన్ 26న మాదక ద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నేషనల్ డే గినెస్ట్ డ్రగ్ ఎబ్యూజ్ ఎండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ డేగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డ్రగ్ ఎబ్యూజ్ వల్ల ఆరోగ్యం పాడవుతుందన్నారు. కుటుంబ సభ్యులతో ప్రేమానుబంధాలు తగ్గిపోతాయని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వడంతోపాటు జ్ఞాపకశక్తి తగ్గిపోతుందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలపట్ల ఎక్కువ శ్రద్ధ చూపాలని చెప్పారు. మాదక ద్రవ్యాల రవాణాకు పాల్పడే వ్యక్తులపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. అనంతరం లీగల్ కేర్ సపోర్ట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టాభిరామారావు, శ్రీదేవి, నివేదిత, కొండల్‌రెడ్డి, సురేందర్, కిశోర్, రవి, శ్రీధర్ , తదితరులు పాల్గొన్నారు.

60 గజాల స్థలాలను కాపాడండి...

బడంగ్‌పేట కమిషనర్ రఘుకుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

బడంగ్‌పేట, జూన్ 26 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నాదర్‌గుల్‌లో ఉన్న సబితా ఇంద్రారెడ్డి కాలనీలో 60గజాల స్థలాలను కొంత మంది కబ్జా చేస్తున్నారని కాలనీ అసోసియేషన్ నాయకులు తాసీల్దార్ మాదవీరెడ్డికి, కమిషనర్ రఘుకుమార్‌కు వేరు వేరుగా ఫిర్యాదులు చేశారు. పేద ప్రజలకు ఇచ్చిన ఇండ్ల స్థలాల సరిహద్దులను గుర్తించి ఇతరుల బెడదలేకుండా చేయాలని విజ్ఞప్తి చేశారు. కాలనీలో డ్రైనేజీ, స్ట్రీట్‌లైట్లు, మంచి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబితా ఇంద్రారెడ్డి కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ యాదవ్, ఉపాధ్యక్షులు బంగారి మురళీ మోహన్, అశోక్, పెంటయ్య గౌడ్, సుదర్శన్, రంగారెడ్డి , విఠల్ ఉన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం ..

సరూర్‌నగర్ పట్టణంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బేర బాలకిషన్, తదితరులు పూజలు నిర్వహించారు. *– ఆర్కేపురం, జూన్ 26*

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

మాట్లాడుతున్న బాల్‌రాజ్

కందుకూరు, జూన్ 26 : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న నిర్వహించే రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల సీఐటీయూ కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి వేతనాలు చెల్లించడం లేదని, వేతనాలతో పాటు సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని వివరించారు. ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యానికి నిరనగా చేపట్టే ముట్టడి కార్యక్రమానికి పంచాయతీ కార్మికులు పాల్గొని విజయ వంతం చేయాలని ఆయన కోరారు.

నివాళి..

కొత్తపేట డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు కాట అశోక్ గౌడ్ దశదినకర్మ సందర్భంగా కొత్తపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, బొల్గం యశ్పాల్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు రాజేశ్, అశోక్ గౌడ్ కుటుంబ సభ్యులు

– ఎల్బీనగర్, జూన్ 26

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

బోడుప్పల్, జూన్26: అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, రచ్చ కిషన్ బుధవారం ప్రభుత్వాన్ని కోరారు.

పారిశుధ్యం లోపించవద్దు

కమిషనర్ రఘుకుమార్

బడంగ్‌పేట ప్రధాన రహదారిపై అడ్డంగా ఉన్న వాటిని జేసీబీ సహాయంతో తొలగిస్తున్న కమిషనర్ రఘుకుమార్

బడంగ్‌పేట, జూన్ 26 : పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రఘుకుమార్ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. బుధవారం వివిధ కాలనీల్లో పర్యటించి రోడ్లపై ఉన్న మట్టి కుప్పలను, చెత్తను కమిషనర్ దగ్గర ఉండి సిబ్బందితో తొలగింపజేశారు. 21వ డివిజన్‌లో నాలా పనులు చేపట్టి రోడ్డుకు అడ్డంగా వదిలేసిన వాటిని జేసీబీ సహాయంతో తొలగించి.. రోడ్డును క్లీయర్ చేయించారు. వర్షాకాలంలో పారిశుధ్యం లోపిస్తే పలు సమస్యలు వస్తాయన్నారు. పారిశుధ్యం లోపించకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. మ్యాన్‌హోల్స్‌ను క్లీన్ చేయించాలన్నారు. నాలా పనులను పరిశీలించారు. గుంతలమయంగా మారిన రోడ్లపై మట్టి పోయించారు. ప్రతి రోజు కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యను వెంటనే పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, రాకేశ్, తదితరులు ఉన్నారు.

యువతను మత్తుకు దూరంగా ఉంచాలి

మాదకద్రవ్యాల వ్యతిరేక దినంపై అవగాహన కల్పిస్తున్న మెట్రో పాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ పారా లీగల్ వాలంటీర్ సత్యనారాయణ రాజు

సైదాబాద్, జూన్ 26 : యువతను డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలని మెట్రో పాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ పారా లీగల్ వలంటీర్ సత్యనారాయణ రాజు అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని ఐఎస్ సదన్ డివిజన్, సుబ్రమణ్యం నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ వద్ద పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తమ కుటుంబంలోని యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు వారి చర్యలను గమనిస్తుండాలని, యువతను లక్ష్యంగా చేసుకొని మత్తును అలవాటు చేయటానికి ప్రయత్నాలు చేస్తారని, వాటికి దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడటం ద్వారా అనారోగ్య, ఆర్థిక ఇబ్బందులతో అనేక సమస్యలను ఎదుర్కొవాల్సి వస్తుందని, అందుకోసం కార్మికులు వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ ఎస్సై లక్ష్మయ్య, సుబ్రమణ్యంనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శర్మ, సెక్రటరీ ప్రసాద రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు

రూ.10వేల నగదు, బైక్ స్వాధీనం

బడంగ్‌పేట, జూన్ 26: చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని బడంగ్‌పేట పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర, నాందేడు, నోటల్ కాలనీకి చెందిన మహమ్మద్ ఉసామా 20 రోజుల క్రితం నగరానికి వచ్చి పతే దర్వాజలో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా కూలీ పని చేస్తుంటాడు. ఇక్కడ నాందేడ్‌కు చెందిన ఇద్దరు అతనికి పరిచయం అయ్యారు. ఈ ముగ్గురు చెడు అలవాట్లకు బానిసై.. స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 21న రాత్రి 8.35 గంటల ప్రాంతంలో బడంగ్‌పేటలోని బాలాజీ నగర్‌లో ఓ మహిళ కిరాణా షాపులో ఉండగా.. ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడును లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి.. నిందితుడిని బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.10వేలు, బైక్ ను స్వాధీనం చేసుకుని.. రిమాండ్‌కు తరలించారు.

కమిషనర్‌కు శుభాకాంక్షలు ..

తెలంగాణ స్టాంపులు, రిజిస్ట్రేషన్లు (సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్) కమిషనర్‌గా నియమితులైన జ్యోతి బుద్ధ ప్రకాశ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిపార్టుమెంట్) అధ్యక్షుడు నరహరిరావు, కార్యదర్శి రాంచందర్, ట్రెజరర్ శ్రీరామ్, కేశవులు, ఉపాధ్యక్షులు నాగేందర్, జాయింట్ సెక్రటరీ ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. *– సైదాబాద్, జూన్ 26*

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్, జూన్ 26: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...మండల పరిధిలోని రాజబొల్లారం పంచాయతీ ఘనపూర్ గ్రామానికి చెందిన శివశంకర్(39)కు సింగాయిపల్లికి చెందిన బస్వాపూర్ శంకరయ్య కూతురు లతతో 10 ఏండ్ల కిందట వివాహం జరిగింది. పెళ్లి జరిగిన నాటి నుంచి ఇద్దరి మధ్య వివాదాలు జరుగుతూ ఉండేవి. నాలుగేండ్ల క్రితం లత ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. శివశంకర్ ఎన్ని సార్లు వెళ్లి బతిమాలినా తిరిగి రాలేదు. దీంతో మనస్తాపానికి గురై శివశంకర్ తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం రాత్రి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని, ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు.

లైంగికదాడి కేసులో.. నిందితుల కోసం గాలింపు

నేరేడ్‌మెట్, జూన్ 26: బాలికపై లైంగికదాడి కేసును కాచిగూడ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి మంగళవారం నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేసిన సంగతి విధితమే. నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అందులో భాగంగా మల్కాజిగిరి డీసీపీ పద్మజారెడ్డి, కుషాయిగూడ ఏసీపీ మహేష్ ఆదేశాలమేరకు నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితులను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడి విజయ్‌కుమార్‌గా గుర్తించి మరో ముగ్గురు నిందితులను బాలు, కృష్ణ, అజయ్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరొక నిందితుడి కిరణ్ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగినిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు

మల్కాజిగిరి,జూన్ 26: బస్తీ దవాఖానలో పనిచేస్తున్న ఓ ఉద్యోగినిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైన ఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ బీజేఆర్‌నగర్‌లోని బస్తీ దవాఖానలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని వద్ద అదే ప్రాంతానికి చెందిన దాసరి శ్యామ్ రూ.1.30లక్షల డబ్బు తీసుకుని ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పాడు. శ్యామ్ తరచూ మానసికంగా, శారీరకంగా ఉద్యోగినిని వేధిస్తున్నాడు. అతని వేధింపులు భరించలేక ఉద్యోగిని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ దగ్ధం

ఘట్‌కేసర్,జూన్26:లారీటైర్‌పేలి బోల్తా పడి లారీ దగ్ధమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్టషన్‌లో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..ఇసుక లోడ్ లారీ ఏటూరునాగారం నుంచి హైదరాబాద్‌కు వస్తుంది.ఏదులాబాద్ రోడ్డులోని అం డర్‌పాస్ వంతెన వద్దకు రాగానే లారీ ముందు టైర్‌పేలి బోల్తా పడింది. లారీ డ్రైవర్ వెంకట్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో లారీ ముందుఉన్న క్యాబిన్,టైర్లు కాలిపోయాయి.ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.